క్లుప్తంగా

మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే కృష్ణ, హరే రామ నామస్మరణ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం మార్మోగింది. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఉచితంగా హోమియో మందుల పంపిణీ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం జరిగింది. ఇందులో 96 మంది రోగులు పాల్గొనగా వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ వారిని పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ఇందులో ఫౌండేషన్ సభ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, కె.చంద్రశేఖర్, సభ్యులు వి.రాంబాబు, వి.శ్రీనివాసరావు, ఎం.శంకర్, రాము, కిశోర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పౌష్టికాహారం అందజేత



చిన్నారులతో దాతలైన ఇంటర్ విద్యార్థులు

మధురవాడ: మన ఫౌండేషన్ ఫ్రెండ్స్ గ్రూప్ పేరుతో తమ పాకెట్ మనీ, మిత్రులు, కుటుంబ సభ్యులు అందజేసిన నగదుతో అనాథ, దివ్యాంగ చిన్నారులకు పౌష్టికాహారం అందజేసి ఆదర్శంగా నిలిచారు ఆ విద్యార్థులు. ఆదివారం మల్లయ్యపాలెంలోని ఆరోగ్య సంరక్షణ కేంద్రం స్పెషల్ చిల్డ్రన్స్ షెల్టర్‌కు చెందిన చిన్నారులకు ఇంటర్ విద్యార్థులు పొట్నూరు హర్షిత్, కొయ్య గౌతంరెడ్డి, రాణా ప్రతాప్, ప్రజయ్, శ్రావణ్, మౌళి చేయూత అందించారు. ఇందులో సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



పతకాలు సాధించిన చిన్నారులు

కొమ్మాది: వడోకాయ్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు ఇండోర్ స్టేడియంలో జరిగిన వైజాగ్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో జీవీఎంసీ 4వ వార్డుకు చెందిన బాలబాలికలు పతకాలు సాధించారు. బాలికల విభాగంలో వాసుపల్లి నివేదిత గోల్డ్ మెడల్, వాసుపల్లి భారతి సిల్వర్ మెడల్ సాధించగా, బాలుర విభాగంలో మన్యాల జ్ఞానేష్ సిల్వర్ మెడల్, 12 సంవత్సరాల మన్యాల ధనుష్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా విజేతలను ఆదివారం కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కోలా ప్రతాప్ కుమార్, కోచ్ వాసుపల్లి శ్రీహరి అభినందించారు.

సమస్యల తిష్ట

- ఇబ్బందుల్లో గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీవాసులు
- క్షీణిస్తున్న పారిశుధ్యం
- వెలగని వీధి దీపాలు
- దూరాభారంలో అంగన్‌వాడీ కేంద్రం



జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పేరుకుపోయిన మురుగు, చెత్త



నివాసాల మధ్య మురుగు నీరు

పీఎం పాలెం: జీవీఎంసీ 6వ వార్డులోని గాయత్రీనగర్ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో తిష్టవేసిన సమస్యలతో స్థానికులు సతమతమవుతున్నారు. కాలనీలోని 19 బ్లాకుల్లో 576 కుటుంబాలు నివసిస్తున్నాయి. కొన్ని బ్లాకుల్లో నివసిస్తున్నవారు వినియోగిస్తున్న వాడుక నీరు పోవడానికి సక్రమమైన డ్రైనేజీ మార్గం లేకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. అలాగే మరుగుదొడ్ల ట్యాంకులు నిండిపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పని చేయని బోర్లు..

కాలనీలో ఏర్పాటు చేసిన బోరింగులు పూర్తి స్థాయిలో పని చేయడం లేదని, వాడుక నీటికి ఇబ్బంది పడాల్సి వస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాలనీలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు అరకొరగా వెలుగుతుండటంతో చీకటి పడితే కాలనీలో అంధకారం ఆవరిస్తోందని వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కాలనీలో తిష్ట వేసిన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అదనపు ట్యాంకు లేక ఇక్కట్లు..



రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గతంలో ప్రతిపాదించిన అదనపు నీళ్ల ట్యాంకు నిర్మించాలి. తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటే ఇది తప్పనిసరి. ఇప్పుడున్న నీళ్ల ట్యాంకు అవసరాలకు సరిపడ స్థాయిలో తాగునీటిని అందించడంలేదు.

–జామి శివకుమార్, స్థానిక నాయకుడు, గాయత్రీనగర్

డ్రైనేజీ సిస్టం మెరుగు పరచాలి..



కాలనీలో కొన్ని బ్లాకుల్లో డ్రైనేజీ సిస్టం బాగులేదు. మురుగునీరు పేరుకుపోయి పారిశుధ్యం క్షీణిస్తోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. అపారిశుధ్యం వల్ల డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ సమస్య పరిష్కరించాలి.

–మజ్జి అప్పలరాజు, గాయత్రీనగర్ కాలనీ

అంగన్ వాడీ కేంద్రం లేక సమస్యలు..



అంగన్‌వాడీ కేంద్రం మరో ప్రాంతంలో ఉండటంతో గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. కాలనీ జనాభాను దృష్టిలో ఉంచుకుని ఇక్కడే కేంద్రం ఏర్పాటు చేయాలి. వివిధ వైద్య సదుపాయాలు అందించడానికి వీలుగా కాలనీలో ఏఎన్‌ఎం క్వార్టర్ నిర్మించాలి.

–డి. రామలక్ష్మి, గాయత్రీనగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ

వీధిలైట్లు వెలగటంలేదు..



కాలనీలో వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. వీధి దీపాలు లేకపోవడం వల్ల రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. వృద్ధులు, పిల్లలు, మహిళలు తిరగలేకపోతున్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

–డి.అఖిల, గాయత్రీనగర్, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ

స్ఫూర్తి ప్రదాత అమర జీవి పొట్టి శ్రీరాములు

డీఈవో ప్రేమ్‌కుమార్

మధురవాడ: స్ఫూర్తి ప్రదాత అమర జీవి పొట్టి శ్రీరాములు అని విశాఖ జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. ప్రేమ్‌కుమార్ అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఆత్మార్పణ దినోత్సవంలో భాగంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రుల అస్తిత్వ పోరాటంలో ప్రాణాలు పణంగా పెట్టిన మహా ధీరుడు శ్రీరాములు అని కొనియాడారు. అటువంటి మహనీయుడిని విద్యార్థులు నిత్యం స్మరించుకోవాలన్నారు. హెచ్ఎం గొట్టిపాటి రవి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు మహాత్మగాంధీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో కలసి నడవడమే కాకుండా దేవాలయాల్లో దళితులకు ప్రవేశంపై కూడా ఉద్యమం చేసి సాధించిన సంఘ సంస్కర్త అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, ప్రకాశ్, రమాదేవి పాల్గొన్నారు.



చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కోరుతూ రాస్తారోకో



ఆనందపురం జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు



వేములవలస అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

తగరపువలస: అంబేడ్కర్ విగ్రహాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆదివారం దళిత నాయకులు ఆనందపురం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. వీటిని ప్రభుత్వాలు తేలిగ్గా తీసుకుంటున్నాయన్నారు. అన్ని మతాలకు పవిత్ర గ్రంథాల వలే 140 కోట్ల మంది భారతీయులకు రాజ్యాంగం పూజ్యనీయమైనదన్నారు. అలాంటి రాజ్యాంగ రచనా నిర్మాతకు అవమానాలు జరుగుతున్నాయన్నారు. ఉప్పాడ అప్పారావు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రభుత్వాలు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బోని సన్నిబాబు మాట్లాడుతూ విగ్రహాలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సియ్యాద్రి రాంబాబు, ఉప్పాడ సత్యనారాయణ, మల్లవరపు కృష్ణ, వై.రామారావు, బోని నరసింగ రావు, వెంకన్న, క్రాంతి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాసోత్సవాలకు ఏర్పాట్లు

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద తాటాకుల పందిరి వేశారు. ఆలయంలో మామిడి తోరణాలు కట్టారు. 16న ముందుగా నగర సంకీర్తన చేస్తారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి విగ్రహాలకు బేడా సేవా నిర్వహిస్తారు. గోదాదేవి అష్ట దిక్పాలకులకు ఆవాహనం పలుకుతారు. తర్వాత గోదాదేవిని భక్తుల దర్శించుకోవడానికి కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద వేసిన పందిరిలో అధిష్టింప చేస్తారు. పదో తేదీన ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహిస్తారు. 13వ తేదీన విష్ణుమూర్తి, గోదా దేవిలకు శాంతి కల్యాణం నిర్వహించడంతో ధనుర్మాసోత్సవాలు ముగిస్తాయి.



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

అలరించిన కూచిపూడి నృత్యాలు



భీమిలిలో నృత్యప్రదర్శనచేస్తున్న విద్యార్థినులు



శిల్పారామంలో ..

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం నాట్య పరిమళ అకాడమీకి చెందిన విద్యార్థినులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భరత నాట్యం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు ఆర్. కృష్ణకుమారి ఈశ్వరిని నాట్య మంజీష ఎక్స్‌లెన్స్ అవార్డుతో సత్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు కె.ముత్యాలరావు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు మైలపల్లి షణ్ముఖరావు, వాసుపల్లి జానకీరామ్ పాల్గొన్నారు.

శిల్పారామంలో...

పీఎంపాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన నటరాజ నృత్యాలయంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు అద్భుతంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించి అలరించారు. కళాకారులు హాసిని, మోక్షిత, గున్విక,చిన్మయి, సౌజన్య, గామిని, సాన్వి, యశ్విత, నక్షత్ర,లిఖిత, దీపిక,నిత్యశ్రీ తదితర కళాకారులు పాల్గొనగా బి. అన్నపూర్ణ నృత్య దర్శకత్వం వహించారు.

నేడు సన్నిధాన మహోత్సవం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సేవా సంఘం సభ్యులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో నేడు మహా సన్నిధాన పూజా మహోత్సవం జరుగనుంది. దీనికి సంబంధించి సేవా సంఘ సభ్యులు ఆదివారం ఏర్పాట్లను పరిశీలించారు, ఈ సందర్భంగా సేవా సంఘం కార్యదర్శి మొకర నర్సింగరావు మాట్లాడుతూ ఇందులో ప్రత్యేక పూజలు, ఊరేగింపు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రినాయుడు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, పెద్దలు మైలిపల్లి షణ్ముఖరావు, గుగ్గిళ్ల సాయి, మధుపంతులు, కె.ముత్యాలరావు, ఆనంద్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

తగరపువలస: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సంతోష్ యాదవ్, చరిత్ర అధ్యాపకుడు నాగరాజు శ్రీరాములు త్యాగాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తగరపువలస ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. పేదలకు వండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, సంఘం అధ్యక్షుడు చెరుకూరి దేముళ్లు, బొర్రా లక్ష్మణ్‌కుమార్, దుర్గా నాగేశ్వరరావు, పేకేటి కామేశ్వరరావు, తాడేపల్లి కోటేశ్వరరావు, బండారు అనిల్, ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ, పక్కి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

పద్మనాభం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్.అప్పారావు, టి.రామకృష్ణ, పాఠశాల విద్యా కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ గురించి చర్చిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఘనంగా దత్త జయంతి

తగరపువలస: ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్ పాఠశాల ఆవరణలోని దత్తాత్రేయ ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభమైన వేడుకలు సాయంత్రం దత్త హోమంతో ముగిశాయి. 300 మంది భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ శాంతి, సహనాన్ని ప్రతి ఒక్కరు అలవరచుకోవాలన్నారు. శంకరమఠం విశాఖ కంచి కామకోటి ఆస్థాన వేద ఘనాపాటి కందుకూరి పురుషోత్తం వేద ఆశీర్వచనం చేశారు. బీవీకే ఆచార్యుడు మూర్తి, మధిర వెంకటరమణ ఆధ్వర్యంలో పూజా క్రతువు నిర్వహించారు.అలాగే మండలంలోని తర్లువాడలో కూడా దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పీఏసీఎస్‌ను భీమిలిలో విలీనం చేయాలని తీర్మానం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (పీఏసీఎస్) తిరిగి భీమిలి మండలంలోని జిల్లా సహకార కేంద్రీయ బ్యాంకు (డీసీసీబీ) బ్రాంచ్‌లో విలీనం చేయాలని కోరుతూ తీర్మానం చేసి కేంద్ర సహకార బ్యాంకు సీఈవోకు పంపించారు. భీమిలి మండల పరిధిలో ఉండే ఈ సంఘాన్ని స్పెషల్ ఆఫీసర్, పీఏసీఎస్ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించి పద్మనాభం మండలంలోని జిల్లా సహకార కేంద్రీయ బ్యాంకులో విలీనం చేశారు. దీనిపై భీమిలి మండల వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు వ్యతిరేకించడంతో 'పీఏసీఎస్ విలీనంపై పునరాలోచించాలి' శీర్షికతో ఈ నెల 6న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నెల 13న సభ్యులతో పాటు స్పెషల్ ఆఫీసర్, సంఘం కార్యదర్శి తీర్మానం చేసి యథావిధిగా ఈ సంఘాన్ని భీమిలి మండలం డీసీసీబీలో విలీనం కోరుతూ తీర్మానం పంపించినట్టు బంగారునాయుడు తెలిపారు.

'పది'లో శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలోని సునీల్ శర్మ కాలనీలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. ప్రేమ్‌కుమార్ ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, బోధన తీరు, వసతులు తదితర విషయాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే విద్యార్థులకు బోధనాంశాలు ఏ మేరకు అర్థం అవుతున్నాయో ప్రశ్నలు వేసి పరీక్షించారు. ముఖ్యంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలులో భాగంగా గణితంలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు విని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో కచ్చితంగా శతశాతం ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె. గీతాదేవి, గణిత ఉపాధ్యాయురాలు యు. నీరజ ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ నుంచి బాండు అందుకుంటున్న కాళ్ల శ్రీనివాస్

తగరపువలస: జీవీఎంసీ 1వ వార్డు చిట్టివలసకు చెందిన కె.జి.ఎస్.ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సింహాచలం శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలోని శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందించారు. చిట్టివలస, తగరపువలస నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు రెండవ వర్ధంతి సందర్భంగా ఈ విరాళం అందించినట్టు ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం సూపరింటెండెంట్ విక్రంరాజు బాండు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు సూర్య, పురుషోత్తం, మదన్, దీపక్, గణేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎంవీలో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ రెండో బ్యాచ్ ప్రారంభం



ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ రెండో బ్యాచ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో ఆదివారం ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ రెండో బ్యాచ్ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ప్రోగ్రాం చైర్‌పర్సన్, ప్రొఫెసర్ హ్యాపీపాల్ మాట్లాడుతూ నిపుణుల కోసం అందుబాటులో ఉండే అభ్యాస అవకాశాల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను ఐఐఎంవీ తీరుస్తుందన్నారు. అడ్మిరల్ చైర్ ప్రొఫెసర్ ప్రశాంత్ ప్రేమ్‌కుమార్ నాయర్ మాట్లాడుతూ రెండేళ్ల ఈ కోర్సుకు విభిన్న పరిశ్రమల నుంచి 102 మంది వర్కింగ్ ప్రొఫెషనల్స్ పాల్గొంటారన్నారు. ఇందులో 23 శాతం మంది మహిళలు ఉంటారన్నారు. అకడమిక్ డీన్ మారిశెట్టి విజయ భాస్కర్ మాట్లాడుతూ నేడు అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌లో నైపుణ్యాల అంతరం తగ్గించడమే ఈ కోర్సు లక్ష్యమన్నారు. టైమ్స్ ప్రో సీఈవో అనీష్ శ్రీకృష్ణ మాట్లాడుతూ అవసరమైన క్లిష్టమైన నైపుణ్యాలతో ఎలా సన్నద్ధం కావాలో పీర్ ఇంటరాక్షన్ ద్వారా క్రాస్ సెక్టోరల్ జ్ఞానాన్ని పెంపొందించనున్నట్టు తెలిపారు. మిడ్ కెరీర్ స్కిల్ పెంపుదలకు ఇది ప్రముఖ వేదిక అన్నారు. డేటా విశ్లేషణ నుంచి డెసిషన్ సైన్స్ వరకు అంశాలతో 740 గంటల పాటు సమగ్ర అభ్యాసాన్ని అందించనున్నట్టు తెలిపారు. డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐఐఎంవీలో నాయకత్వ వికాస పునాది అత్యుత్తమ అభ్యాసాలను అధిగమించి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కెర్నీ పెర్‌ల్యాబ్‌చీఫ్ ఆపరేటింగ్ అధికారి విశాల్ మాలిక్, అడ్మినిస్ట్రేషన్ డీన్ కావేరి కృష్ణన్ తదితరులు మాట్లాడారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



సంగివలసలో సమావేశమైన చిట్టివలస జెడ్పీహైస్కూల్ 1992 బ్యాచ్ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీహైస్కూల్‌కు చెందిన 1992 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సంగివలసలో సమావేశమయ్యారు. మూడు దశాబ్దాల కిందటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఏటా చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. ఆటలు, పాటల పోటీలు, క్విజ్ నిర్వహించి బహుమతులు అందించారు. ఆత్మీయ విందు ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస పాత్రో, బడిగంటి మహేష్, బోని ఈశ్వరరావు, శిరువురి శ్రీనివాస వర్మ, పిట్ట శ్రీనివాసరావు, చెన్నా అప్పలరాజు, గేదెల సన్యాసప్పడు, అక్కరమాని చినబాబు, మద్దిల సుబ్బారావు, హేమంత్, బీవీ వెంకటఅప్పారావు, జగుపల్లి సూరిబాబు, కనకల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తూచ్..శిలాఫలకం మూసివేశారు

సాక్షి ఎఫెక్ట్..



శిలాఫలకాన్ని పేపర్లతో మూసివేసిన దృశ్యం



అక్టోబర్ 5 వతేదీన వేసిన శిలాఫలకం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిట్టివలసలో రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించి శిలాఫలకం వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెటింగ్ శాఖ మరోమారు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేరుతో గత అక్టోబర్ 5న శిలాఫలకం వేశారు. వాస్తవానికి ఆయన రాకుండానే ప్రారంభోత్సవం పేరుతో రెండో శిలాఫలకం వేయడం చూసి పలువురు నవ్వుకుంటున్నారు. దీనిపై 'అంతా మాయే..'శీర్షికతో ఈ నెల 14న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో కళ్లు తెరిచిన మార్కెటింగ్ శాఖ అధికారులు హడావుడిగా ఈ రెండో శిలాఫలకాన్ని పేపర్లతో మూసివేశారు.

ఉత్సాహంగా బెల్ట్‌గ్రేడింగ్ పోటీలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని షాడో షోటోకాన్ కరాటే అసోసియేసన్ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు జరిగాయి. ఇందులో 12 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్‌లు సాధించారు. ఇద్దరు ఆరెంజ్, ఇద్దరు పర్పల్ , ఇద్దరు బ్రౌన్ బెల్ట్‌లు సాధించారు. వీరికి కరాటే అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకట రమణయాదవ్ ప్రశంసా పత్రాలు అందించారు.

హిందీ సర్టిఫికెట్ల పంపిణీ

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ చెన్నై ఆధ్వర్యంలో గత సెప్టెంబర్‌లో నిర్వహించిన తొమ్మిది రకాల లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలకు సంబంధించిన సర్టిఫికెట్లను ఆదివారం విద్యార్థులకు అందించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు వీటిని పంపిణీ చేశారు. 2025 ఫిబ్రవరిలో నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి యథావిధిగా ఉచిత శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. వీటిని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కృష్ణారావు కోరారు.

గ్రంథ పఠనంతో జ్ఞాన సముపార్జన

తగరపువలస: పద్మనాభం మండలం విజయరాంపురంలో త్రైతసిద్ధాంత భగవద్గీత, ప్రబోధ సేవాసమితి ప్రతినిధులు ఆదివారం భీమిలి మండలం తాటితూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని దీని విశిష్టత గురించి వివరించారు. అలాగే దీపావళి, గురువు ప్రాధాన్యతలను తెలిపారు. ధనుర్మాసంలో గురువును శరణు వేడితే ఉత్తరాయణంలో మోక్షం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, వి.భవానీ, ఎస్.అచ్చియ్యమ్మ, బి.అంకమ్మ, కె.లక్ష్మి, భారతి, రాజు పాల్గొన్నారు.